రైతుల ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

• కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడ్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడ్, మే 6: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని, వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండలంలోని కొప్పోలు, గుర్రంపోడులో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో నిజామాబాద్ మొదటి స్థానంలో ఉండగా నల్లగొండ రెండో స్థానంలో నిలిచిందన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి లారీలను ఎప్పటికప్పుడు పంపించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కేటాయించిన లారీలు సరిపోకపోతే అదనంగా స్థానికంగా ఉన్న లారీలను ఏర్పాటు చేయాలని తాసీల్దార్ శ్రీనివాసులును ఆమె ఆదేశించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ హరీశ్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, తాసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

లోలెవల్ కాల్వ పరిశీలన

నిడమనూరు : మండలంలోని ఎర్రబెల్లి శివారులో గల లోలెవల్ కాల్వను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. లోలెవల్ కాల్వ ద్వారా శనగకుంట చెరువును నింపేందుకు కాల్వపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని రైతులు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదన మేరకు కలెక్టర్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి కాల్వ అండర్ టన్నెల్‌ను సందర్శించారు. ఆమె వెంట నీటిపారుదలశాఖ సబ్‌డివిజన్ డీఈ శివరాత్రి శ్రీనివాస్, ఏఈ ప్రవీణ్‌రాజు, తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీఓ రమేశ్ ఉన్నారు.

నకిరేకల్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

• ఇంటర్ బోర్డు అధికారి భీమ్‌సింగ్

అధ్యాపకులకు సలహాలు, సూచనలు చేస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారి భీమ్‌సింగ్

నకిరేకల్, మే 6 : నకిరేకల్ ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు అధికారి భీమ్‌సింగ్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల కోసం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఐఈఓ దస్రూనాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం అధ్యాపకుల యాక్షన్ ప్లాన్ స్వీకరించి వారి సలహాలు, సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ మల్లారెడ్డి మాట్లాడుతూ అదనపు సెక్షన్లు, గ్రూపులకు కావాల్సిన అధ్యాపకులను నియమించడానికి ఇంటర్ కమిషనర్ కృష్ణ ఆదిత్య సానుకూలంగా స్పందించారని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. సమావేశంలో అధ్యాపకులు శ్రీనివాస్, రామకృష్ణ, విద్యార్థులు, పాల్గొన్నారు.

కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడు కొండ వెంకన్న

ప్రధాన కార్యదర్శి దశరథ

నకిరేకల్, మే 6 : కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి ధరావత్ నాగేశ్వరరావు సమక్షంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కొండ వెంకన్న, ఉపాధ్యక్షుడిగా చౌగోని వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా మల్లెబోయిన దశరథ, కోశాధికారిగా చౌగోని నాగయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం మే5, 2030 వరకూ కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు తండు వెంకటేశ్వర్లు, కొండ శ్రీను, కొండ యాదమ్మ, తలారి వీరమ్మ, బొప్పని సైదులు పాల్గొన్నారు. కార్యవర్గాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

• సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ,ఏఐటీయూసీ నాయకులు డబ్బికార్ మల్లేశ్, పల్లా దేవేందర్‌రెడ్డి

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 6: ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు డబ్బికార్‌మల్లేశ్, పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కొత్తగా వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. కనీసం కార్మిక సంఘాల పెట్టుకొనే పరిస్థితి లేకుండా చేసిందని, కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవాలని కుట్రచేస్తున్నదని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, నాయకులు పాపిరెడ్డి, రాంచంద్రు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎండీ సయ్యద్, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా నాయకులు అంజయ్య, టీఎన్‌టీయూసీ నాయకులు అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

12న ఓంకార్ శత జయంతి ఉత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ, మే 6: ఈ నెల 12న వరంగల్ జిల్లా వాదాపూర్‌లో ఎంసీపీఐయూ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దికాయల ఓంకార్ శత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఓంకార్ శతజయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మద్దికాయల ఓంకార్ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, ధీరావత్ మోహన్‌నాయక్, జ్యోతి, కిరణ్, ఇమ్మానియేల్, రవి, వీరన్న, సందీప్, శారద, సాలమ్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, MADDIKUNTLA KRISHNA REDDY, S/o. MADDIKUNTLA LINGA REDDY (Old Name), R/o. H.No.3-180/1, Ravindra Nagar, Miryalaguda, Nalgonda (Dist). Pincode-508207, I have changed my name as MADDIKONTLA KRISHNA REDDY, S/o. MADDIKONTLA LINGA REDDY (New Name) for all future purposes.

ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది
బొబ్బిలి వెంకట్‌రెడ్డి, S/o. రోశిరెడ్డి, R/o.H.No.9-34, దీపకుంట గ్రా॥, నల్లగొండ మం॥, జి॥,. నా ప్లాటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నెం.8130/2010 (E.Kavitha, W/o.Sravan Kumar) పేరున గల బాస్కర్ టాకీస్ ఏరియా నుండి కనకదుర్గ కాలనీ నల్లగొండ ప్రయాస్తుండగా పోయినది దొరికినవారు సంప్ర॥9441945143.

NAME
I, GODAS RAMESH S/o.BACHAIAH GODAS, H.No: 1-122, Perika Wada, Ramannapet, Rachakonda Yadadri District - 508113, In My Passport Bearing No.L8090303 Mentioned as GODAS RAMESH. Changed My Name As GODASU RAMESH
7 lines NT+ [TELLA]

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ)
నల్లగొండ: 9182777625, 9182777635 దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059
మిర్యాలగూడ: 9182777059

నిలిచిన ఎగుమతులు.. ఆందోళనలో రైతులు

• లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
• కాంటా వేసి రోజులు గడుస్తున్నా మిల్లులకు చేరని వైనం
• వాతావరణంలో మార్పులతో ఆందోళన చెందుతున్న రైతులు

ఘనపురం కొనుగోలు కేంద్రంలో లారీలు లేకపోవడంతో నిలిచిపోయిన ధాన్యం ఎగుమతులు

పెద్దఅడిశర్లపల్లి, మే 6 : రైతుల ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలో రైతులు యాసంగిలో పెద్ద ఎత్తున వరి సాగు చేయడంతో ధాన్యం దిగుబడి కూడా ఆమేరకు వచ్చింది. రైతులు కోతల అనంతరం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం అన్ని కేంద్రాల్లో ధాన్యం నిండుగా ఉంది. కానీ అధికారులు, కేంద్రం నిర్వాహకులు మాత్రం లారీల కొరత, హమాలీలు లేరని చెబుతూ కొనుగోళ్లను ఆలస్యం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పీఏపల్లి, అంగడిపేట, గుడిపల్లి, ఘనపురం, యర్రగుంట తండా, దుగ్యాల, కోదండపురంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఘనపురం కొనుగోలు కేంద్రంలో కాంటా వేసి ఎగుమతి కోసం 5 వేల బస్తాలను సిద్ధం చేశారు. కానీ లారీలు రాక కాంటా వేసిన ధాన్యం బస్తాలు కేంద్రంలోనే ఉండిపోయాయి. ఇతర మండలాల్లో బోర్లకింద సాగు చేసిన ధాన్యం ముందుగా రావడంతో వాటిని మండలంలోని మిల్లులకు కేటాయించారు. మిల్లర్లు వాటిని దిగుమతి చేసుకొని తమ టార్గెట్ పూర్తయ్యిందంటూ మిగతా ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు నిరాకరిస్తున్నారు. దాంతో మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలు అలాగే ఉండి పోయాయి. మిల్లుల టార్గెట్ పెంచుతూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా అవి స్థానికంగా అమలుకు నోచడం లేదు. ప్రస్తుతం 50 శాతానికి పైగానే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది.

నెల రోజులుగా పడిగాపులు

రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి నెలరోజులవుతున్నా లారీల కొరత పేరుతో కొనుగోలు చేయడం లేదు. ధాన్యం పూర్తిగా ఎండి మాయిశ్చర్ వచ్చినా నిర్వాహకులు బస్తాలు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాంటా వేసిన ధాన్యం లారీల్లోకి ఎత్తక పోవడంతో ధాన్యం బస్తాలు కూడా కేంద్రాల్లోనే ఉండి పోయాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం, సాయంత్రం వేళల్లో అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజూ సాయంత్రం కాగానే ధాన్యం రాసులపై పట్టాలు కప్పడం, ఉదయం వాటిని తొలగించి ఆరబెట్టడం నిత్య కృత్యంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం తీసుకొచ్చి నెల రోజులవుతుంది

నేను నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన. నాలుగు రోజుల క్రితం బస్తాల్లోకి నింపిన, అయినా వాటిని లారీల్లోకి ఎత్తడం లేదు. అకాల వర్షాలు వస్తుండడంతో ధాన్యం తడుస్తుందనే భయంతో రోజూ పట్టాలు కప్పుకుంటున్నాం. ధాన్యం మిల్లుకు పోయే వరకు మాదే బాధ్యత కాబట్టి రోజూ బస్తాల కాడ పడిగాపులు కాస్తున్నాం. అధికారులెవరూ పట్టించుకోక పోవడంతో నాలాంటి రైతులందరూ ఇబ్బందులు పడుతున్నరు.

-బద్దెల సత్తయ్య, రైతు, ఘనపురం

ఛత్రపతి సాహూ మహారాజ్‌కు నివాళి

చందంపేట(దేవరకొండ), మే 6 : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఛత్రపతి సాహూ మహారాజ్ 100వ వర్ధంతిని దేవరకొండ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడిన కులాలకు తొలిసారిగా రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఛత్రపతి సాహూ మహారాజ్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరికుప్పల శ్రీను, పున్న వెంకటేశ్, కడారి బలరాం, బాషా, శ్రీను, ఎండీ.బాబా, సురకారం దశరథగౌడ్, లక్ష్మణ్‌నాయక్, శాంసన్, పెద్దిరాజు, మహేందర్‌నాయక్, నరసింహ, మహేశ్ పాల్గొన్నారు.

సాయి మణికంఠ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా వెంకన్న గౌడ్

కట్టంగూర్, మే 6 : మండల కేంద్రంలోని సాయి మణికంఠ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గాదగోని వెంకన్నగౌడ్ ఎన్నికయ్యాడు. మంగళవారం ఆలయంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో చైర్మన్ జెల్లా ముత్తి లింగయ్య, కోశాధికారి గుడిపాటి శివప్రసాద్ సమక్షంలో వెంకన్న గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు

చందంపేట, మే 6 : తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నేరేడుగొమ్ము మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొర్ర శిరీష మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈ నెల 26న స్కూల్ నోటీసుబోర్డుపై ఉంచుతామని తెలిపారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

చందంపేట(దేవరకొండ), మే 6 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా ప్రైవేటు స్కూళ్లు ప్రచారం నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకుండా ఉన్నట్లుగా ప్రకటించుకునే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన సంఘం నాయకులు వెంట పాత్లావత్ లక్ష్మణ్, పొట్ట మధు, జమీర్‌బాబా, పిల్లి పరమేశ్, పంది హరికృష్ణ, మైనంపల్లి ప్రవీణ్ ఉన్నారు.

వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి

మునుగోడు, మే6 : మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ గుర్రం యాదయ్య(51) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. గుర్రం యాదయ్య సోమవారం గ్రామంలో ఉపాధిహామీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పనులు చేస్తున్న సమయంలో అస్వస్థత గురికావడంతో తోటి కూలీలు ఇంటికి పంపించే సమయంలో కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

ఆటవిక న్యాయం అమలు చేసేలా బండి సంజయ్ మాటలు

• ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రామగిరి, మే 6: కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రకటిస్తే.. చర్చలు లేవు కాల్చి చంపుతామంటూ ఆటవిక న్యాయం అమలు చేసేలా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడటం సరికాదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్టీ నల్లగొండ పట్టణ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజా స్వామ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పేద ప్రజలపై ధరల భారాలు పెంచుతూ, కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికారులు తక్షణమే సర్వే నిర్వహించిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, కేఎస్‌రెడ్డి, బలుగూరి నరింహ, గుండె రవి, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడి, పుట్టల సుజాత, కౌసల్య పాల్గొన్నారు.

ఇంటర్ ఒకేషనల్‌లో మునుగోడు విద్యార్థికి రాష్ట్ర స్థాయి ర్యాంక్

సాయి శ్రీవర్షిత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మే 6 : ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఒకేషనల్ ఫలితాల్లో మునుగోడు మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల కళాశాల విద్యార్థి దుబ్బ సాయి శ్రీ వర్షిత్ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఇంటర్ వృత్తివిద్యాకోర్సు(ఎంఎల్‌టీ) చదివిన శ్రీవర్షిత్ 991 మార్కులు సాధించారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసానికి విద్యార్థిని పిలిపించుకొని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి దుబ్బ విజయ్‌భాస్కర్, నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, ఎండీ అన్వర్, దుబ్బ ప్రభాకర్, పందుల నరిసింహ ఉన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

• మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం, మే 6: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నేలతల్లిని కాపాడుకోవాలని నిడమనూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ పార్వతీ చౌహాన్ అన్నారు. మంగళవారం మండలంలోని కంపసాగర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అవసరం మేరకే రసాయన ఎరువులను వాడడం వల్ల ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదును తీసుకొని దానిని భద్రపర్చుకోవాలని సూచించారు. సాగు నీటిని ఆదా చేసి భావి తరాలకు అందించాలన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు పంట మార్పిడి విధానం, అపరాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జి.శివప్రసాద్, సంధ్యారాణి, మాజీ వైస్ ఎంపీపీ అవిరెండ్ల మట్టయ్య, శ్రీనివాస్, వి.వెంకటయ్య, ఏఈఓ సమీర్‌పాషా, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దు

• డీఈఓ భిక్షపతి

రామగిరి, మే 6: నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ రవీంద్రనగర్‌లోని జయ హైస్కూల్, హాలియా, దేవరకొండలోని శ్రీచైతన్య హైస్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేవని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే ముందు వాటికి ప్రభుత్వ గుర్తింపు ఉందా అనే విషయాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

• ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ నర్సింహ

మర్రిగూడ, మే 6 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ బాలం నర్సింహ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని శివన్నగూడెం, ఖుదాభక్ష్‌పల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కేంద్రాల్లోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కేంద్రాల్లో 218మంది రైతుల నుంచి 30,704 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో దళారీ వ్యవస్థను ప్రోత్సహించకుండా అధికారులు టోకెన్ నంబర్ ప్రకారం కొనుగోళ్లను జరిపించాలని సూచించారు. ఆయన వెంట సహకార సంఘం సీఈఓ బండి మధుకర్‌గౌడ్ ఉన్నారు.

ధాన్యం లారీలకు ప్రత్యేక సీరియల్ నంబర్ కేటాయించాలి

మునుగోడు, మే 6 : మునుగోడు మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తరలించే లారీలకు ప్రత్యేకమైన సీరియల్ నంబరు కేటాయించాలని మండల లారీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులను కేటాయించారని, లారీలు మిల్లుకు చేరుకునే లోగా చండూరు, కనగల్లు, నల్లగొండ మండలాల నుంచి కూడా ధాన్యం లారీలు వస్తుండడంతో ధాన్యం బస్తాల దిగుమతికి నాలుగు రోజుల సమయం పడుతుందని తెలిపారు.

అకాల వర్షం..తడిసిన ధాన్యం

చండూరు : అంగడిపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాసుల మధ్యలో చేరిన వాన నీరు

చండూరు, మే6: చండూరు మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం తడిసింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తడువకుండా కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడ్డారు. కొద్దిరోజులుగా కొనుగోలు కేంద్రాలకు లారీలు సక్రమంగా రాకపోవడంతో తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా అక్కడే ఉన్నాయి. బస్తాలు తడువకుండా టార్పాలిన్లు కప్పినా ఈదురు గాలులకు అవి ఎగిరిపోయి ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈదురు గాలుల బీభత్సం

ఈదురు గాలులకు ఒరిగిన వాడపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ధ్వజస్తంభం

దాబరచర్ల : మండలంలోని వాడపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలుల ఉధృతికి గ్రామ శివారులోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ధ్వజస్తంభం ఓ వైపునకు ఒరిగింది. మీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న భారీ చెట్టు కూలిపోయింది. ఆలయ కమిటీ చైర్మన్లు కొందూటి సిద్దయ్య, పాదిలశ్రీనివాస్ ఆలయాలను సందర్శించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 6 : నకిరేకల్, కేతేపల్లి, చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్ మండలాలకు చెందిన 300 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిరేకల్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అర్హులకు మాత్రమే వాటిని కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు గుత్తా మంజులా మాధవరెడ్డి, నర్రా వినోదా మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్, తాసీల్దార్లు ఎస్‌కే జమీరొద్దీన్, గుగులోతు ప్రసాద్‌నాయక్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల దరఖాస్తులు నెలరోజుల్లో పరిష్కరిస్తాం : ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నకిరేకల్, మే 6 : రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి నెలరోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ అశోక్‌రెడ్డి హామీ ఇచ్చారు. నకిరేకల్ మండలం నెల్లిబండ, మండలాపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు గ్రామంలోనే ఉంటారన్నారు. రైతుల కోసం సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేశామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో నకిరేకల్, కట్టంగూర్ తాసీల్దార్లు ఎస్‌కే జమీరొద్దీన్, గుగులోతు ప్రసాద్ నాయక్, మండల అధికారులు పాల్గొన్నారు.

బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు యువకుల మృతి

లోకేశ్ (ఫైల్)

నిఖిల్ (ఫైల్)

శాలిగౌరారం, మే 6 : బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని మాదారం కలాన్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన మాదగాని లోకేశ్(24), మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దోనిబాయి గ్రామానికి చెందిన రాచకొండ నిఖిల్(22) స్నేహితులు. మంగళవారం బైక్‌పై సూర్యాపేట జిల్లా అర్వపల్లి వైపు బయల్దేరారు. మాదారం కలాన్ గ్రామం వద్ద నేషనల్ హైవేపై కారు రాంగ్ రూట్లో వచ్చి బైక్‌ను ఎదురుగా అతివేగంగా ఢీకొట్టింది. దాంతో లోకేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. నిఖిల్‌కు సైతం తీవ్ర గాయాలు కావడంతో 108లో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు.

మహిళ అదృశ్యం

మహబూబ్‌బీ

చిట్యాల, మే 6 : చిట్యాల పట్టణంలోని చంద్రపురి కాలనీకి చెందిన శేక్ మహబూబ్‌బీ కనిపించడం లేదని మంగళవారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపారు. మహబూబ్‌బీ మానసిక పరిస్థితి సరిగా లేక పోవడంతో ఈ నెల 4న ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె కోసం బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో ఆమె భర్త శేక్ కరీముల్లా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

త్రిపురారం జడ్పీహెచ్‌ఎస్‌లో వేసవి శిక్షణ శిబిరం

త్రిపురారం, మే 6: త్రిపురారం జడ్పీహెచ్‌ఎస్‌లో 11 నుంచి 14 సంవత్సరాల లోపు విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, కుట్లు, అల్లికలు, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లీశ్ వంటి అంశాలపై నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్లా రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరం జూన్ 5 వరకు కొనసాగుతుందని, శిక్షణకు వచ్చే విద్యార్థులకు స్నాక్స్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులిజాల విష్ణుకుమార్, మొండె వెంకట్, ధనావత్ సైదా, బచ్చలకూరి ఏడుకొండలు, బుర్రి బాలయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నిడమనూరు, మే 6 : మండలంలోని కక్కయ్యగూడేనికి చెందిన కుంచం సైదయ్య (40) మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదయ్య తన గొర్రెల కోసం ఇంటి పక్కన రేకుల షెడ్డు నిర్మించాడు. సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు రేకులు ఎగిరిపోయాయి. మంగళవారం ఉదయం రేకులు సరి చేస్తుండగా అవి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దౌర్జన్యం చేసిన వ్యక్తికి జరిమానా

నిడమనూరు, మే 6 : పంచాయతీ కార్యదర్శి విధులను ఆటంకపర్చి దౌర్జన్యానికి పాల్పడిన నిందితుడికి జరిమానా విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి టి.స్వప్న మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ అధికారి షేక్ అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి సాగర్ మండలం తునికినూతల గ్రామంలో 2018 అక్టోబర్ 15న ఏర్పాటు చేసిన గ్రామ సభలో స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారుల జాబితాను పంచాయతీ కార్యదర్శి ఉబ్బెపల్లి శ్రవణ్‌కుమార్ చదివి వినిపించారు. గ్రామానికి చెందిన రమావత్ దేవు నాయక్ పంచాయతీ కార్యదర్శిని దుర్భాషలాడుతూ జాబితా లాక్కొని దౌర్జన్యం చేశాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు దేవు నాయక్‌పై అప్పటి ఎస్‌ఐ కుర్మయ్య కేసు నమోదు చేశారు. మంగళవారం కేసు విచారించిన జడ్జి నిందితుడిపై నేరం రుజువు కావడంతో రూ.2 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజుల సాధారణ జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సాధన ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు.

దాడి కేసులో నిందితుడికి జరిమానా

పెద్దవూర మండలంలోని బోనూతలకు చెందిన కంచర్ల అంజయ్య కుంకుడు చెట్టు తండా వద్ద ఎలక్ట్రికల్ మెకానిక్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుంకుడు చెట్టు తండాకు చెందిన రమావత్ హతీరాం అతడికి ఫ్యాన్‌ను రిపేరు కోసం ఇచ్చాడు. 2016 ఆగస్టు 27న ఫ్యాన్ ఇవ్వమని హతీరాంను అడుగగా డబ్బులు ఇచ్చి తీసుకెళ్లాలని మెకానిక్ శ్రీను కోరాడు. డబ్బు ఇవ్వకుండా ఫ్యాన్ తీసుకెళ్తుండగా శ్రీను అడ్డుకున్నాడు. దాంతో హతీరాం ఫ్యాన్ గడ్డతో శ్రీనుపై దాడి చేయగా తలకు గాయమైంది. మెకానిక్ భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ బి.ప్రసాద్‌రావు కేసు నమోదు చేశారు. మంగళవారం కేసు విచారించిన జడ్జి నిందితుడిపై

నేరం రుజువు కావడంతో రూ.వెయ్యి జరిమానా విధించారు.